

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

30 జూన్ 2025 పేజీలు : 08 సోమవారం




## ప్రకృతి అందాల కనువిందు..

# కండలేరు వ్యూ

- ఆహ్లాదాన్ని నింపుతున్న బోటు షికారు
- 25 హెక్టార్లలో జింకల పార్కు.. మరో 9 హెక్టార్లలో బొటానికల్ పార్క్
- ఆధ్యాత్మిక శోభితం కోదండరామస్వామి ఆలయం
- విశాలమైన రోడ్లు.. వృక్ష సంపద.. శ్రామిక చిహ్నంతో ప్రత్యేక ఆకర్షణగా అతిథి గృహం అందాలు





**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :**

పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలంలో సహజ సిద్ధమైన ప్రకృతి ప్రసాదించిన 'అందాలతో కనువిందు చేస్తున్న కండలేరు రిజర్వాయర్ శోభ పర్యాటకులను ఇట్టే ఆకర్షిస్తూ కట్టిపడేస్తున్నాయి. 68 టీఎంసీల సామర్థ్యం కలిగిన కండలేరు జలాశయం నిరంతరం సాగు, తాగునీటి అవరాలను తీర్చే కల్పతరువుగా ప్రాముఖ్యతను సంతరించుకోవడంతోపాటు పరీవాహక ప్రాంతాలన్నీ ఉట్టిపడుతున్న అందాలను సొంతం చేసుకున్నాయి. నెల్లూరు జిల్లాలోని నలుమూలలతో పాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి ప్రకృతి, జంతు ప్రేమికులు సకుటుంబ సపరివార సమేతంగా కండలేరు ప్రాంతానికి సందర్శనార్థం విచ్చేస్తున్న పర్యాటకులు ఆహ్లాదకర వాతావరణంలో బోటు షికారు చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతుండటం, ఆధ్యాత్మిక శోభతో కనువిందు చేస్తున్న కోదండరామ స్వామి ఆలయం.. విశాలమైన రోడ్లు.. అబ్బురపరచే వృక్ష సంపద.. కార్మిక లోకానికి స్ఫూర్తిదాయకంగా ఏర్పాటు చేసి ఉన్న శ్రామిక చిహ్నంతో ప్రత్యేక ఆకర్షణగా ముచ్చట గొలిపే రీతిలో ఆతిథ్యమిచ్చి ఉపశమనం కల్పిస్తున్న అధునాతన గెస్ట్‌హౌస్ (అతిథి గృహం) భవన సముదాయాల అందాల వీక్షించేందుకు ఇష్టపడుతుంటం ఇక్కడి ప్రత్యేకతగా చెప్పవచ్చు.

**జింకల పార్కు విశిష్టత :**

1983లో పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, రాపూరు మండలంలో రూపుదిద్దుకున్న కండలేరు రిజర్వాయర్ ఆనకట్ట నిర్మాణం నాటికి కండలేరు పరీవాహక ప్రాంతమంతా దట్టమైన చిట్టడవులు,

>> 2లో..

## అధ్వానంగా పారిశుద్ధ్యం

2 లో







## సుపరిపాలనలో 'తొలి అడుగు'

### హాజరైన వేమిరెడ్డి దంపతులు

**నెల్లూరు, మేజర్‌న్యూస్ :**

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో, మంత్రి నారా లోకేష్ సారథ్యంలో నిర్వహించిన సుపరిపాలనలో 'తొలి అడుగు' కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఆదివారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి టీడీపీ కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో వేమిరెడ్డి దంపతుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏడాది పాలనను విజయవంతంగా

-మిగతా 2లో







# ప్రతిభా పురస్కారాలు ప్రదానం




**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో అగ్నికుల క్షత్రియ, వన్నియకుల క్షత్రియ విద్యార్థులకు ఆదివారం ఉదయం ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం నెల్లూరు మూలాపేటలోని శ్రీ వీరశైవ కళ్యాణ మండపంలో నెల్లూరు జిల్లా అగ్నికుల క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు చమ్మండి రాము అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 2025వ సంవత్సరం 10వ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలలో ప్రథమ స్థానం సాధించిన 50 మంది విద్యార్థిని, విద్యార్థులకు పురస్కారాలు, బహుమతులు అందించారు. చమ్మండి రాము మాట్లాడుతూ.. తమ సంఘం ఆధ్వర్యంలో 17వ దఫా ఈ ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రతిభా పురస్కారాలు విద్యార్థులను ప్రోత్సహించేందుకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తమిళనాడు సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు ప్రొఫెసర్ రామకృష్ణన్ మాట్లాడుతూ.. వెనుకబడిన కులాల జాబితాలో ఉన్న అగ్నికుల వన్నియకుల క్షత్రియులు విద్యలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని చెప్పారు. నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహాయ ప్రొఫెసర్ డాక్టర్ మల్లెంబాక వెంకట్రావు మాట్లాడుతూ.. దూరదృష్టి విద్యతో పాటు ప్రవేశ పరీక్షలు ఉద్యోగార్థ పరీక్షలకు తగిన అభ్యాసం చేయాలని సూచించారు. నగరపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచి అరవింద మాట్లాడుతూ.. క్రమశిక్షణతోపాటు స్మార్ట్‌ఫోన్లు, కాలక్షేపాలకు దూరంగా ఉండి ఇంటర్ విద్యలో తగిన శ్రద్ధ చూపించాలని సూచించారు. పొదలకూరు బిఎస్ఎన్ఎల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ పాకం రవితేజ, డాక్టర్ సాదా శ్రీలక్ష్మి, ఏలూరు వెంకట సుమంత్ కుమార్, పూజారి హరిత, తిరువత్తూరు శివశంకర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన శ్రీవర్షిత, మధుప్రియ, పవన్ ప్రమోద్, పూర్ణచంద్ర, రజిత తదితరులకు నగదు, జ్ఞాపికలు బహుమతిగా అందజేశారు.

## అంకాలమ్మను దర్శించుకున్న పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు దంపతులు



**వరికుంటపాడు, మేజర్‌న్యూస్ :** మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామంలో వెలసి ఉన్న శ్రీ అంకాలమ్మ తల్లి తిరునాళ్లకు ముఖ్యఅతిథిగా విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటగా గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు దంపతులకు గ్రామంలో ఘన స్వాగతం పలికారు. ఆలయం వద్ద వేద పండి తులు పూర్ణకుంభంతో ఆ దంపతులకు స్వాగతం పలికి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలను చేయించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న సిపి రాజశేఖర్ బాబు దంపతులు గోత్రనామాలతో పూజలు చేయించుకొని, స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, పెద్దలు సిపి దంపతులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## లాక్షాగృహ దహన ఉత్సవం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు మూలాపేటలోని శ్రీకృష్ణ ధర్మరాజ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం చప్పర ఉత్సవం ఘనంగా నిర్వహించారు. రాత్రి లాక్షాగృహ దహన ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి జానకమ్మ ఆధ్వర్యంలో ఉభయకర్తలు, ఆలయ అర్చకులు, పాలకమండలి సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకను తిలకించడానికి భక్తులు విశేషంగా తరలి వచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

### ప్రకృతి అందాల కనువిందు..

# కండలేరు వ్యూ

(మొదటి పేజీ తరువాయి)

ముళ్లపొదలతో నిండి ఉండటంతో అడవి జంతువుల రకానికి చెందిన అరుదైన జింకల జాతి అత్యధిక సంఖ్యలో పచ్చిక బైళ్లపై స్వేచ్ఛగా సంచరిస్తూ ఆహారాన్ని సేకరించడంతోపాటు సమీపంలోని జలాశయం, కాలువల్లో దాహార్తిని తీర్చుకుంటూ ఆహ్లాదకర వాతావరణం మధ్య ఆడుతూ. తోటి జంతువులతో స్నేహపూర్వకంగా పోరాటాలు చేస్తూ హాయిగా సేద తీరేందుకు ఆవాస యోగ్యంగా ఉండేది. ఈ విషయాన్ని గుర్తించిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ప్రత్యేక చొరవతో సందర్శకులు, చిన్నారులకు వినోదాత్మక అనుభవాన్ని అందించే ఉద్దేశ్యంతో 1990లో హైదరాబాద్లోని నెహ్రూ జువాలజికల్ పార్క్ నుంచి దిగుమతి చేసిన రెండు ఆడ జింకలతో ప్రత్యేక డీర్ పార్కును 25 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేయించారు. ఇదేక్రమంలో 1992లో తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర జువాలజికల్ పార్క్ నుంచి దిగుమతి చేసిన మరో రెండు (ఆడ, మగ) జింకలను అనుసంధానం చేయడం జరిగింది. ఈక్రమంలో జింకల జాతి పరిరక్షణ, మనుగడ తోపాటు వాటి సౌకర్యార్థం అన్ని రకాల మౌలిక సదుపాయాలతో కూడిన పార్కును జింకలపార్కు అభివృద్ధి, పర్యవేక్షణ బాధ్యతలను అటవీశాఖకు అప్పగించిన అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ ఆదేశాను సారం రాపూరు రేంజ్లో అనుసంధానం చేసిన అటవీ శాఖ ఉన్నతాధికార యంత్రాంగం స్థానిక క్షేత్రాధికారి సారథ్యం, దాచూరు సెక్షన్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పర్యవేక్షణలో ప్రత్యేక సిబ్బందిని నియమించడం జరిగింది. ఇదే క్రమంలో పార్కులో సంరక్షింపబడుతున్న జింకల బాగోగులు చూసుకోవడం, సకాలంలో మేత, నీరు అందించే లక్ష్యంతో తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగింది. ప్రభుత్వ మార్గదర్శకాలను శిరోధార్యంగా భావిస్తూ జింకలపార్కు నిర్వాహణపై ఎంతో బాధ్యతగా వ్యవహరించిన అటవీ అధికారులు ప్రతి ఏటా స్పష్టమైన గణాంకాలతో జింకలు (పెద్దవి), పిల్లల వర్గాలను నివేదికల రూపంలో అందజేయడం ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. డీర్ పార్కులో ప్రస్తుతం ఆడ, మగ, చిన్న, పెద్ద కలిసి 90 నుంచి 100 వరకు జింకలు ఆశ్రయం పొందుతున్నట్లు అటవీ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

**బొటానికల్ పార్క్..**

కండలేరు డ్యామ్ ఫార్మేషన్ సమయంలో 9 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బొటానికల్ భావి భారత పౌరులైన విద్యార్థుల శాస్త్ర పరిశోధనలకు అవసరమైన ఔషధ గుణాలు కలిగిన మొక్కలను అందించే కల్పతరువుగా ప్రత్యేకతను సంతరించుకుంది. కండలేరు జలాశయం సందర్శనకు విచ్చేసే పర్యాటకుల్లో అత్యధిక శాతం మంది సైన్స్ విద్యార్థులు, శాస్త్రజ్ఞులు, ఇతర ప్రకృతి, వృక్ష ప్రేమికులు ఉండటంతో ఖచ్చితంగా బొటానికల్ పార్క్‌లోని ఔషధ గుణాలు కలిగిన మొక్కలను వీక్షించేందుకు ఆసక్తి చూపుతుండటం విశేషంగా చెప్పవచ్చు.

### సుపరిపాలనలో 'తొలి అడుగు'..

## హాజరైన వేమిరెడ్డి దంపతులు



(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేసుకున్నామని, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు అంతా కలిసి పని చేద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పార్టీ కలిసి సమన్వయంతో పని చేయాలనీ, ఏడాది కూటమి పాలన విజయాలపై, జులై 2 నుంచి ఇంటింటికి ప్రచారం మొదలు పెడుతున్నామని, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే క్రమంలో కూటమి భాగస్వాములంతా కలిసి ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.

## అధ్వానంగా పారిశుద్ధ్యం




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నగరపాలక సంస్థ పరిధిలోని ప్రాంతాల్లో పారిశుద్ధ్యం లోపించి అధ్వానంగా ఉంది. ముఖ్యంగా ఆదివారం అయితే పారిశుద్ధ్యం లోపించి పలుచోట్ల దుర్గంధంగా ఉంది. నగరపాలక సంస్థ పరిధిలో నిత్యం 300 టన్నుల మేరకు చెత్త సేకరణ జరుగుతుంది. అదేవిధంగా ఇంటింటి చెత్త సేకరణ కూడా నామమాత్రంగా పలుచోట్ల ఉంది. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులు పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేక పోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. పలుచోట్ల ఏర్పాటుచేసిన డంపర్ బిన్లు చెత్త నిండిపోయి ఉన్నాయి. ఈ చెత్త వల్ల ఆ ప్రాంతం అంత దుర్గంధంగా మారాయి. కొన్నిచోట్ల రోడ్లపై చెత్త నిండిపోయి ఉంది. ఆదివారం పూట పారిశుద్ధ్యం పరిస్థితి ఎక్కడ చూసినా అధ్వాన్నంగా ఉంటుంది. చెత్తతో పాటు పర్యావరణానికి పెనుముప్పుగా మారిన ప్లాస్టిక్ కవర్స్ చెత్తలో నిండిపోయి ఉన్నాయి. చెత్తకుప్పలో ఎక్కువ శాతం ప్లాస్టిక్ కవర్లే కనిపిస్తున్నాయి. నగరపాలక పరిధిలో 54 డివిజన్లు ఉండగా, వాటి పరిధిలో 166 వార్డు సచివాలయాలున్నాయి. అదేవిధంగా శానిటరీ సూపర్‌వైజర్లు, ఇన్స్పెక్టర్లు ఉన్నప్పటికీ కొన్నిచోట్ల పారిశుద్ధ్య నిర్వహణపై వారి పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో కొన్నిచోట్ల ఆశించిన విధంగా పారిశుద్ధ్యం మెరుగుపడలేదు. ఇకనైనా అధికారులు నగరంలో పారిశుద్ధ్యం లోపించకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పరిశ్రమల అభివృద్ధిలో కార్మికులే కీలకం




**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** పరిశ్రమల అభివృద్ధిలో కార్మికులు కీలకంగా ఉంటారని సీఐటీయూ జిల్లా జనరల్ సెక్రెటరీ అజయ్ కుమార్ అన్నారు. ఆదివారం ముత్తుకూరు శ్రామిక భవనంలో కార్మికులకు నిర్వహించిన క్లాసులకు ఆయన హాజరై బోధించారు. గోగుల శ్రీనివాసులు, గడ్డం అంకయ్య, మోహన్‌రావు, ఏడుకొండలు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి జనరల్ సెక్రెటరీ ప్రసంగించారు. జులై 9న దేశవ్యాప్తంగా తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ ఉద్యోగికి ఘన సన్మానం



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో గార్డెనర్‌గా 39 సంవత్సరాలుగా బాధ్యతలు నిర్వహించి పదవి విరమణ చెందిన ఎన్ని పల్లి శ్రీనివాసులుకు ఆదివారం కళాశాల యాజమాన్యం సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత డీఎం అండ్ హెచ్ఓ కే.శిలామణి రెస్పాండెంట్ రాజా పవన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిలామణి మాట్లాడుతూ.. శ్రీనివాసులు అంకితభావంతో తన విధులను నిర్వర్తించారని ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా తన బాధ్యతలు ఎంతవరకు నిర్వర్తించాలో ఎవరికి ఇబ్బంది లేకుండా నిర్వర్తించిన బాధ్యతగల వ్యక్తిగా పేరుపొందారున్నారు. ఆయన యొక్క వ్యక్తిత్వాన్ని వివరించేందుకు పాట ద్వారా వివరించారు. ఈ పాట వచ్చిన ప్రేక్షకులకు ఎంతో ఆనందాన్ని కలిగించింది అలాగే కరస్పాండెంట్ పవన్ కుమార్ మాట్లాడుతూ.. మా కళాశాలలో సుదీర్ఘకాలం నిధులు నిర్వహించిన శ్రీనివాసులు ఎవరికి ఎటువంటి ఆటంకం లేకుండా అసౌకర్యం కలవకుండా విధులు నిర్వహించి ప్రశాంతమైనటువంటి వాతావరణంలో పదవి విరమణ చేస్తున్నారని తెలిపారు. ఆయన శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో గడపాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ పద్మనాభం మాట్లాడుతూ.. అధ్యాపకులతో మమేకమై విద్యార్థులకు అధ్యాపకులకు వారధిగా నిలిచి తన విధులను నిర్వర్తించారని ఇది ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు ఎప్పుడూ కూడా తనలో ఉన్న శాంత స్వభావాన్ని వదిలిపెట్టక ఎంతో సహనంతో తనకు నిర్దేశించిన విధులను సక్రమంగా సకాలంలో నిర్వహించే ఎవరికీ ఎటువంటి అసౌకర్యం లేకుండా చేశారన్నారు ఇంత సుదీర్ఘకాలం విధులను నిర్వచించడం ఆయనకు భగవంతుడిచ్చిన వరప్రసాదంగా పేర్కొనవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు జడ్పిటిసి సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బలరాంరెడ్డి, విశ్రాంత అధ్యాపకులు నాగిరెడ్డి, బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మాలకొండయ్య, కళాశాల సిబ్బంది గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.

# వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్



**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాల మేరకు, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సిహెచ్ సౌజన్య సూచనల మేరకు సామాన్య ప్రజలలో ధైర్యం నింపుతూ పోలీసు వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి, జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టే లక్ష్యంగా వేదయపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంగళరావు నగర్ ప్రాంతంలో ఏ బ్లాక్ నందు తెల్లవారుజామున కార్డన్ సర్చ్ ఆపరేషన్ ఆదివారం నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, దొంగతనాల నివారణ, శాంతిభద్రతలను పరిరక్షణ, అసాం ఘిక శక్తుల ఏరివేతే లక్ష్యంగా వేదయపాలెం స్టేషన్ పరిధిలోని 450ఇళ్లను క్షుణ్ణంగా శోధించి, సరైన పత్రాలు లేని 45 బైకులు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 6 మంది అనుమానితులను గుర్తించి వారి దగ్గర వేలిముద్రలు సేకరించి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వేదయపాలెం పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పరారీలో ఉన్న నేరస్తులను గుర్తించి వారిని అదుపులోకి తీసుకోవడం, బంగారు, వెండి వంటి చోరీ సొత్తు, అనుమానం గా ఉన్న రికార్డ్ లేని అన్ని వస్తువులను, వాహనాలను, అక్రమ మద్యం, ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదిగ ద్రవ్యాలు వంటి వాటిని గుర్తించి స్వాధీన పరచుకోవడం ఈ ఆపరేషన్ యొక్క ముఖ్య ఉద్దేశమని ఆయన తెలియజేశారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు కఠిన ఆదేశాలు ఉన్నాయని, అదిక్రమించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు నమోదు చేస్తామని, ప్రజలు తమ వంతు సహకారాన్ని అందించాలని అదేవిధంగా అనుమానాస్పద వ్యక్తులకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 112 కు తెలియజేయాలని కోరారు. ఈ కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహణలో నలుగురు సీఐలు, నలుగురు ఎస్సైలు, స్పెషల్ పార్టీ పోలీసులు సిబ్బంది మొత్తం45 మంది పాల్గొన్నారు.

# ఆర్భాటపు ప్రకటనలతో ప్రజలను మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆర్భాటపు ప్రకటనలతో కాలయాపనచేస్తూ ప్రజలను కూటమి పాలకులు మభ్యపెడుతున్నారని, వారిచ్చిన ఎన్నికలనాటి హామీలు ఎన్నటికి అమలు చేస్తారో అర్ధంకావడం లేదని, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో పాలన సాగుతుండగా సర్వత్రా బెంబేలెత్తుతున్నారని వైసీపీ పంచాయతీరాజ్‌విభాగం ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రవికుమార్‌రెడ్డి పేర్కొంటూ కూటమిపాలనపై విమర్శలు సంధించారు. ఆదివారం ఆయన పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆదేశాలమేరకు పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో కరపత్రాలను రూపొందించామని, వాటిని 30వ తేదీ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు అందజేయనున్నామన్నారు. ఎన్నికల సమయంలో కూటమినేతలు 143 హామీలతో మ్యానిఫెస్టో విడుదల చేశారని, ఏడాదికి రెండు హామీలు అమలుచేస్తే మిగతావాటి అమలుకు ఎన్నేళ్ళుపడుతుందని ఆయన ప్రశ్నించారు. పంచాయతీలకు విడుదల చేస్తున్న కేంద్రప్రభుత్వ ఆర్థికసంఘ నిధులు ఆయా పంచాయతీలకు జమకాకుండా దారిమళ్ళించారని, ప్రకటనలు మాత్రం చేశారని ఆయన పేర్కొన్నారు. నిధులు విడుదలకానందున గ్రామపంచాయతీల్లో ఏపనులు చేసే పరిస్థితి లేకుండా సర్పంచ్‌లు ఇబ్బందిపడుతున్నారన్నారు. జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్రప్రభుత్వం విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధిహామీపథకం ద్వారా జరిగేపనులను గ్రామపంచాయతీల ద్వారానే జరపాలని ఆయన డిమాండ్ చేశారు. తమనేత జగన్మోహన్‌రెడ్డి అనేక ఆందోళనలు చేయగా తల్లికివందనం పథకం అమలుచేయగా అందులో అనేక అవకతవకలు జరిగాయని, అయితే ఈపథకం సర్పంచ్‌లకు వర్తించకుండా ఆంక్షలు విధించారని, సర్పంచ్‌ల్లో పేద వర్గాలవారున్నారని, వారికి ప్రభుత్వం నెలకు 3వేల రూపాయల గౌరవవేతనం ఇస్తుండగా ఆసాకుతో వారికి తల్లికివందనం వర్తించకుండా చేయడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. వెంటనే సర్పంచ్‌లకు తల్లికి వందనం వర్తింపజేయాలని రవికుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్రం విడుదల చేసిన 15వ ఆర్థికసంఘ నిధులు 1150కోట్ల రూపాయలను వెంటనే ఆయా పంచాయతీలకు జమచేయాలని, బిల్లుల చెల్లింపులో రాజకీయజోక్యం నివారించాలని, రాజ్యాంగంలో 73, 74 ఆర్టికల్ సవరణల మేరకు సర్పంచ్‌లకు ఉన్న అధికారాలు అమలుచేయాలని, 11వజివోను రద్దుచేసి గాలిలో ఉన్న 1350మంది పంచాయతీ కార్యదర్శులకు పోస్టింగ్‌లు ఇచ్చి వారికి 10నెలల పెండింగ్ జీతాలు చెల్లించాలని, గ్రామాల్లో వసూలు చేసే ఇంటిపన్నులను స్థానికసంస్థల ఖాతాల్లో జమచేయాలని, సర్పంచ్‌లు, ఎంపిటిసి,జెడ్పిటిసి సభ్యులకు గౌరవవేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలని, వారి గౌరవవేతనాలను పెంచాలని రవికుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆరవేడు, బోయలచిరువెళ్ళ, పమిడిపాడు సర్పంచ్‌లు సూరం ప్రసాద్‌రెడ్డి, బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాలెపాటి సతీష్‌నాయుడు, వైసిపి నాయకులు సోమవరపు సుమంత్‌రెడ్డి, బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి, దాడి శ్రీనివాసులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ మట్టి తోలకాన్ని అడ్డుకున్నారని దాడి




**జలదంకి, మేజర్‌న్యూస్ :** జమ్మలపాలెం చెరువులో 3రోజులుగా అడ్డు అదుపు లేకుండా అక్రమంగా మట్టి తోలుకుంటున్న ట్రాక్టర్లను అడ్డుకుంటే, అడ్డుకున్న వారిపై దాడి చేసిన ఘటన జలదంకి మండలంలోని జమ్మలపాలెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో సింగమనేని మనోజ్, శెట్టిపల్లి మధులకు తీవ్ర గాయాలయ్యాయి. మనోజ్‌కు తల పగులుగా, మధు తీవ్ర గాయాలపాలై కావలి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళితే జమ్మలపాలెం మాజీ సర్పంచ్ నక్క మాధవరావు, ఆయన సోదరుడు ఆధ్వర్యంలో 3రోజులుగా చెరువులో నుంచి అక్రమంగా మట్టి తోలుతున్నారు. ఈ విషయమై మనోజ్, మధులు ప్రశ్నించారు. ఇది మంచి పద్ధతి కాదంటూ ఇక మట్టితోల వద్దంటూ చెప్పారు. మమ్ములనే అడ్డుకుంటావా అంటూ జేసీబీతో కొట్టి చంపేస్తామంటూ, పూడ్చి వేస్తామంటూ మాజీ సర్పంచ్ నక్కా మాధవ్ రావు, వారి సోదరులు దూషణలకు దిగారని, వెనుక నుంచి వచ్చి రాడ్డుతో మనోజ్ పై దాడి చేయగా మనోజ్ తలకు తీవ్ర గాయమైంది. మధుపై దాడి చేశారు. గాయాల పాలైన మనోజ్, మదులను కావలి ఏరియా ఆసుపత్రికి వైద్యం కోసం కావలి పోలీసులు ఏరియా వైద్యశాలకు వచ్చి బాధితుల వద్ద నుంచి ఫిర్యాదును నమోదు చేశారు.

## మహిళా సంరక్షణ కార్యదర్శుల రిక్వెస్ట్ బదిలీలు

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** గ్రామ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులుగా ఎవరైతే గత ఐదు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారు, ప్రత్యేక కేటగిరి వారు రిక్వెస్ట్ బదిలీ కోరు, వారి యొక్క బదిలీల కొరకు ఆప్షన్ ఫారాలను సరైన సమాచారంతో నింపి తేదీ 30-06-2025 సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ కార్యాలయం నందు ఇవ్వగలరని, అదేవిధంగా బదిలీలు కోరుకున్న వారు వారి యొక్క సొంత మండలం, సొంత వార్డ్, ప్రస్తుతం పని చేయుచున్న సచివాలయం ఇవ్వబడదని, తప్పుడు సమాచారం ఇచ్చిన యెడల వారే బాధ్యులు అవుతారని నెల్లూరు జిల్లా పోలీస్ కార్యాలయం పీఆర్ఓ ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## దుర్గమ్మ సేవలో వేమిరెడ్డికి ఘనస్వాగతం

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం బెజవాడ ఇంద్రకీలాద్రిలో వెలసియున్న శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారిని ఆదివారం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు వేమిరెడ్డికి మేళ తాళాలు మంగళ వాయిద్యాలతో ఘనస్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం విజయ భాస్కర్ రెడ్డి దుర్గమ్మకు నివేదనలు సమర్పించి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు అమ్మవారి కృపాకటాక్షాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని వేమిరెడ్డి ఆకాంక్షించారు. ఆలయ అర్చకులు వేమిరెడ్డికి శాలువాతో సత్కరించి వేద ఆశీర్వచనాలు చేసి తీర్థ ప్రసాద వినియోగాలను అందించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి ముఖ్య నేతలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## బాలికపై లైంగిక దాడి

**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** బాలికపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని లేబూరు గ్రామం అవ్వతాత కాలనీలో 9ఏళ్ల చిన్నారిపై తుపాకుల లోకేష్ (23) అనే వ్యక్తి గత రాత్రి లైంగిక దాడికి పాల్పడినట్లు సమాచారం. బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్లో తమ కుమార్తెపై లైంగిక దాడి జరిగినట్లు ఆరోపిస్తూ ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలియజేశారు.

## యువతీ అదృశ్యంపై కేసు నమోదు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి పట్టణంలోని రోజుదారీ వేదిక చెందిన అనే యువతి అదృశ్యమైనట్లు ఆమె తల్లి పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయగిరిలోని ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్ పనిచేసేందుకు వెళుతున్నట్లు ఇంట్లో తెలపడంతో ఆమె సోదరుడు బైక్ పై స్కూల్ వద్ద వదిలి వచ్చాడు అనంతరం కొంతసేపటి తర్వాత అతడు అక్కడికి వెళ్లడంతో ఆమె కనిపించలేదు దీంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# ప్రపంచంలో అవసరమైంది, విలువైంది ఆరోగ్యం మాత్రమే

## జిజిహెచ్ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ ఏంబేటి శ్రీకాంత్







**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** ఈ ప్రపంచంలో మానవునికి అవసరమైనది, విలువైనది ఆరోగ్యం మాత్రమేనని నెల్లూరు జిజిహెచ్ అసిస్టెంట్ సివిల్ సర్జన్ డాక్టర్ ఎంబెట్టి శ్రీకాంత్ అన్నారు. ఆదివారం, నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని డైకస్ రోడ్ సెంటర్ లోని వియాని హెూమ్ నందు యాన్యువల్ హెల్త్ క్యాంప్ జరిగింది. ఈ మెగా మెడికల్ క్యాంపులో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్ని సంస్కరణలు చేసిన పేదలకు, అనాధలకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదన్నారు. విద్య, వైద్యం అందరికీ అవసరం అన్నారు. అందులో భాగంగా ఆదివారం మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశామన్నారు. వియాని హెూమ్ సిస్టర్స్ రమా, రూబియా మాట్లాడుతూ.. ఈ క్యాంప్ నందు 500 మంది విద్యార్థినీ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బంధువులకు నెల్లూరులోని ప్రముఖ వైద్యశాలలు రిచ్ రవి చిన్నపిల్లల హాస్పిటల్, శ్రీ సాయి చేతన్ హాస్పిటల్, మెడికవర్ హాస్పిటల్, రామ్స్ డెంటల్ వరల్డ్ అండ్ కిడ్స్ డెంటల్ వరల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో తమ వైద్య సేవలు అందించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ.. విద్య, వైద్యం వ్యాపారం కావడంతో పేదలు, నిర్భాగ్యులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని, పేదలకు ఉపయోగపడే స్వచ్ఛంద సంస్థల ద్వారా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్వచ్ఛందసంస్థలు వైద్యం అందుబాటులో లేని చోట మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి పేదలను ఆదుకోవాలన్నరు. శిబిరం నందు అన్ని రకముల సాధారణ వ్యాధులు, గైనకాలజీ, డెంటల్, చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. స్టూడెంట్స్‌కి బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాల్యాద్రి, డాక్టర్ ఏ.ఝాన్సీరెడ్డి, డాక్టర్ సోనియా, డాక్టర్ నౌషీన్, పిహెచ్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి గోరంట్ల శేషయ్య, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ షేక్ రసూల్, జయ తదితరులు పాల్గొన్నారు.

# బారసాల కార్యక్రమంలో జీడీడీ దివాకర్ దంపతులు



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో స్థానికరంకు రోడ్లో ఉన్న ఎస్ఆర్ పార్క్ ఫంక్షన్ హాల్‌లో పాత్రికేయులు గర్రె వెంకటేశ్వర్ల మనుమరాలు బారసాల కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పీఏ బీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జీడీడీ దివాకర్ జమున దంపతులు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కొద్దిసేపు క్రైస్తవ కీర్తనలతో ఆరాధన నిర్వహించి అనంతరం మత బోధకులు కొద్ది నిమిషాలు దేవుని వాక్యాన్ని ప్రచురించారు. అనంతరం జీడీడీ దివాకర్ జమున దంపతులు బేబీని ఉయ్యాలలో వేసి నామకరణాన్ని చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పరిస్థితులను బట్టి తల్లిదండ్రులు బిడ్డలను ఎంతో జాగ్రత్తతో పెంచాలని నైతిక విలువలు తెలియాలని, అలాగే ఈ లోకం వైపు బిడ్డలు చూడకుండా దేవుని భయం ముందు తల్లిదండ్రులు భయం పెద్దల యందు గౌరవంగా సమాజంలో జీవించేందుకు తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమని వారు తెలిపారు. అనంతరం ఆ బిడ్డకి 'ప్రీష హదస్థ' అను నామకరణ చేశారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ పెద్దలు పాల్గొని ఈ ప్రార్ధనలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కావలి పట్టణ ప్రముఖ, ఆర్యవైశ్యులు ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన అచ్చమాంబ బ్రహ్మోత్సవాలు





**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** మర్రిపాడు మండలంలోని పొంగూరు మాలిచేలో వెలసిన అచ్చమాంబ ఆలయం వద్ద బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. గత వారం రోజుల నుంచి ఉత్సవాలు ప్రారంభమైనప్పటికీ సమీపంలోని భీమవరం ఒంగోలు కేతిగుంట గ్రామాల్లో అత్యమాంబ దేవత బ్రహ్మోత్సవాలు జరిగి చివరి రోజున ఆలయం వద్ద ఆయా గ్రామాల ప్రజలు ఉపవాసాలు ఉండి పొంగళ్ళు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని భక్తులే కాకుండా జిల్లా నలుమూలల నుంచి ఆలయం వద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా నెలకొన్న ఈ ఆలయం వద్దకు అత్యధిక సంఖ్యలో బ్రహ్మోత్సవాలకు హాజరు కావడంతో ఆలయ కమిటీ సభ్యులు పోలీసుల సహకారంతో శాంతిభద్రతలను కట్టుదిట్టం చేశారు. ఆత్మకూరు సిఐ గంగాధర్, మర్రిపాడు ఎస్సై శ్రీనివాసరావు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతను ఏర్పాటు చేశారు. ఆలయం వద్దకు వచ్చినటువంటి భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

# అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలి

## ● సామజిక వేత్త మాలకొండా రెడ్డి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** అవినీతి వెతిరేక చట్టాలపై అవగాహన పెంచుకొని మహాత్మా గాంధీ కలలు కన్నా అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలని లోక్ సత్తా ఉద్యమ నేత ఎం.మలకొండా రెడ్డి కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అవినీతి వెతిరేక చట్టాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన దేశ ఆర్ధిక, రాజకీయ, సామజిక పురోగతికి అవినీతి ఒక ప్రధాన అవరోధము అని తెలిపారు. ముఖ్యంగా అవినీతిని నియంత్రించడానికి కేంద్ర స్తాయిలో సీవీసీ, సీబీఐ, లోక్ పాల్ రాష్ట స్తాయిలో ఏసీబీ, సీఐడీ, లోక యుక్తా ద్వారా అవినీతిని నిర్మూలించడానికి కృషి చేస్తున్నారని అన్నారు. లంచం ఇవ్వడం తీసుకోవడం నేరమని తెలిపారు. పెరుగుతున్న అవినీతిని నియంత్రణ చేయడానికి ప్రజా ప్రతినిధులు, పౌర సంస్థలు నిరంతరం కృషి చేయాలని కోరారు.

# ఉన్నత పాఠశాల మౌలిక వసతులను తనిఖీ



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకట్రావుపల్లి పాఠశాలలలోని మౌలిక వసతులను రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం, నెల్లూరు జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకట సుబ్బయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉదయగిరిలోని తరగతులను నూతనంగా నిర్మించిన భవనాలకు మార్చాలని, మౌలిక వసతులు కల్పించే విషయంలో ముందుగా ఎలక్ట్రికల్ పనులు పూర్తి చేయాలని అందుకు సంబంధించిన నిధులు వారంలోపు విడుదల చేస్తామని, మిగతా మౌలిక వసతులకు సంబంధించిన నిధులు త్వరితగతిన మంజూరు చేస్తామని ప్రధానోపాధ్యాయులు ఎస్‌కే షరీఫ్ బాషా, ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారులైన షేక్ మస్తాన్ వలి, తోట శ్రీనివాసులు తెలియజేశారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెంకటరావుపల్లికి సంబంధించి కూడా మౌలిక వసతుల కల్పనలో త్వరితగతిన నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

# గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



**ఇందుకూరుపేట, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోనిపల్లెపాడు గ్రామంలో ఉన్నపినాకిని సత్యాగ్రహగాంధీ ఆశ్రమంలోకోకన్వీనర్ నెల్లూరు రవీంద్రా రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం సర్వమత ప్రార్ధనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తొలుత కో కన్వీనర్ నెల్లూరు రవీంద్రారెడ్డి, కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రం, నూలుమాల సమర్పించారు. అనంతరం ఆశ్రమ స్థలదాత పోనక కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రం, నూలుమాలసమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మా గాంధీయొక్కజీవిత విశేషాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కమిటీ సభ్యులు గణేశం సుమంత్ రెడ్డి, సుబ్బారెడ్డి, ఆశ్రమ మేనేజర్ మనోజ్, స్కూల్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల ఆర్థిక అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం : ఆర్‌పీఐ

**నెల్లూరు అర్బన్/క్రైం, మేజర్‌న్యూస్ :** దళితుల ఆర్థిక అభివృద్ధిని అడ్డుకొని 9కోట్ల 50లక్షల ప్రజాధనాన్ని ప్రభుత్వాధికారుల నిర్లక్ష్యంతో నాశనం చేశారని, బుజబుజ నెల్లూరు దగ్గర తుప్పు పట్టి పాడవుతున్న వాహనాలే నిదర్శనమని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎస్‌కే మాబు తెలియజేశారు. ఆదివారం బుజబుజ నెల్లూరు ప్రాంతంలో ఆర్‌పీఐ పార్టీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2018 సంవత్సరం ఆఖరిలో ఎన్ఎస్ ఎఫ్‌డీసీ కేంద్ర ప్రభుత్వం సంస్థ వారు నిరుపేద దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందు తారనే ఉద్దేశంతో సబ్సిడీ లోన్లు కింద వాహనాలు కేటాయించారు. లబ్ధిదారులకు పంపిణీ చేయ మంటే ఎన్నికల కోడ్ వచ్చిందని నిలిపివేశారని. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత కూడా లబ్ధిదా రులకు పంపిణీ చేయకుండా ఆ వాహనాలు దేనికి పనికి రాకుండా చేసి దళితుల ఆర్థిక అభివృద్ధి అడ్డుకున్నారని తీవ్రస్థాయిలో మండి పడ్డారు. 9కోట్ల 50 లక్షల రూపాయల ప్రజాధ నాన్ని వాహనాల రూపాన అలా దేనికి పనికి రాకుండా తుప్పు పట్టే విధంగా చేసిన సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులను కఠినంగా శిక్షించాలని ఆర్‌పీఐ పార్టీ డిమాండ్ చేస్తుందన్నా రు. ఎక్కడ చూసినా దళితులు, ముస్లింలు, బహు జనలు, ఆర్థిక అభివృద్ధిని అడ్డుకోవడమే ఆన వాయితీగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సబ్సిడీ లోన్లు ఇస్తుంటే అధికారులకు ప్రజాప్రతినిధులు వాళ్ళ ఆస్తుల్లో ఏదో ఇస్తున్నట్టు ఫీల్ అయిపోతున్నారని ఎద్దేవా చేశారు. ఈ తుప్పు పట్టిన ప్రోక్లైన్లు, ట్రాక్టర్లు, మరియు ఆటోలను వాహనాలు ఏదో విధంగా రీ మోడలింగ్ చేయించి 2018-19 సంవత్సరంలో ఎంపిక చేసిన లబ్ధిదారులైన నిరుపేదలైనటు వంటి దళితులకు కేటాయించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బత్తల మధు సూదన్, దుంపల సుబ్బారావు, ఆరికొండ సురేష్, ముసలి జయరాజ్ తూపిలి వంశీకృష్ణ, వల్లపు ధనుంజయ, వజ సుధాకర్, కంచి అశోక్, ప్రశాంత్, కల్లు అనిల్, శ్రీధర్, ఎస్‌కే బాబు, అర్షద్, నంబూరు గణేష్ తదితరులు పాల్గొన్నారు.



# బుచ్చిలో 6వ కార్మిక సంఘం జిల్లా మహాసభలు



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** నెల్లూరు జిల్లా కార్మిక సంఘం 6వ జిల్లా మహాసభ బుచ్చిరెడ్డిపాలెంలోని అంబేడ్కర్ భవనం నందు జరుగుతున్నాయి. ఈ మహాసభల జయప్రదం చేయడానికి బుచ్చిరెడ్డిపాలెం మండల కేంద్రంలో ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాధయ్య పి.రాజయ్యల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆటో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మారుబోయిన రాజా, కోలగట్ల సురేష్ పాల్గొని మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం ఈ జిల్లాలో 7వేల మంది కార్మిక వర్గానికి నాయకత్వం వహిస్తూ అతిపెద్ద గుర్తింపు పొందిన కార్మిక సంఘంగా కార్మికుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ఉంది. అంతేకాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌ఫోర్ట్ రంగ కార్మికులపై అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎప్పటికప్పుడు కార్యక్రమాల రూపొందిస్తూ కార్మికుల సంక్షేమం కోసం, వాళ్ళ అభివృద్ధి కోసం పోరాటం కొనసాగిస్తూ ఉంది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ఆటో కార్మికులకి 15వేల రూపాయలు వాహన మిత్ర పథకం ద్వారా ఇస్తానని హామీ ఇవ్వడం జరిగింది. అయితే అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన కూడా ఇంతవరకు వాహన మిత్ర పథకం అమలు చేసినటువంటి పరిస్థితి లేదు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం భారతదేశ కార్మిక వర్గాన్ని బానిసత్వంలోకి నెట్టే విధంగా కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోట్లుగా చేసింది. ఈ నాలుగు లేబర్ కోడలు రద్దు చేయాలని జులై 9వ తేదీ దేశవ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంతేకాకుండా ఆటో 6వ జిల్లా మహాసభకు జిల్లా నలుమూలల నుండి అధిక సంఖ్యలో ప్రతినిధులు కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆటో కార్మిక సంఘం సహాయ కార్యదర్శి నున్న సురేష్ బుచ్చి మండల ఆటో నాయకులు వడ్డీ మాల్యాద్రి, బి.దుర్గ, పి.రమేష్, బి.మల్లికార్జున, ఎం.బాలకృష్ణ, ఎ.శ్రీనివాసులు, జి.నాగరాజు, వి.శ్రీనివాసులు, కె.వెంకటేశ్వర్లు, ఎస్‌కే ఖాజా తదితరులు పాల్గొన్నారు.

# యూటర్న్ అనుకూలంగా ఏర్పాటు చేయాలని వినతి



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** ప్రస్తుతం వింజ మూరులో జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. ఈ క్రమంలో యూటర్న్ ఏర్పాటులో ప్రజలకు అసౌకర్యంగా లేకుండా అనుకూలంగా ఏర్పాటు చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం పెట్రోల్ బంక్ దగ్గర నుండి బంగ్లా సెంటర్ వరకు ఎలాంటి యూటర్న్ ఇవ్వక పోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పెట్రోల్ బంకు నుండి స్థానిక నేతాజీ పాఠశాలకు వెళ్లే మార్గం దగ్గర యూటర్న్ ఇచ్చినట్లయితే అందరికీ అనుకూలంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. లేనట్లయితే ఎక్కువ దూరం తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. గుత్తేదారులు చెప్పిన విధంగా నిర్మాణం చేస్తున్నట్లు రోడ్డు నిర్మాణ సిబ్బంది తెలియజేయడంతో ప్రయాణి కులు ఇబ్బందికరంగా ఆలోచిస్తున్నారు. కావున రోడ్డు నిర్మాణ కాంట్రాక్ట్ దారులు ప్రజల యొక్క సౌకర్యాన్ని పరిశీలించి యూటర్న్ దూరాన్ని తగ్గించి సౌకర్యవంతం చేయగలరని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జనసేన కుటుంబానికి అండగా జనసేన నేతలు



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి గ్రామానికి చెందిన జనసేన క్రియా శీల సభ్యులు ఎస్కే రియాజ్ సోదరి కరిష్మా గత నాలుగు నెలలుగా బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతూ మంచంలో ఉంది. ఈ విషయం తెలుసుకున్న ఉదయగిరి నియోజకవర్గం పీఓసీ కొట్టే వెంకటేశ్వర్లు ఆది వారం జనసేన నాయకులతో కలిసి కరిష్మాను పరామర్శించి ధైర్యం చెప్పారు. తమవంతుగా పదివేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రామ్ చైతన్య, తోట మురళి, రఘు, జానీ, మహీంద్రా, మహీధర్, రియాజ్, రమేష్, సుభానిలు పాల్గొన్నారు.

## యోగా శిక్షణ కార్యక్రమం



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు దుర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు యోగాంధ్ర సంబంధించి ఆదివారం ఉదయం 6:30 గంటలకు దేవస్థానంలో యోగా శిక్షణ కార్యక్రమం జరుగినది. ఈ సందర్భంగా యోగా శిక్షణ దారుడైన సురేష్ రెడ్డి యోగ యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ యోగా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు దేవస్థానం సిబ్బంది పాల్గొనడం జరిగింది. ప్రతి ఆదివారం ఉదయం 6 గంటలకు దేవస్థానానికి సంబంధించిన కల్యాణ మండపంలో యోగా శిక్షణ కార్యక్రమం జరుగును అని కావున అందరూ యోగశిక్షణలో పాల్గొని వారి యొక్క జీవన శైలిని మార్చుకునే విధంగా ఈ కార్యక్రమం ఉంటుందని సహాక కమిషనరు, కార్యనిర్వహణాధికారి తెలిపారు.

## ఆరోగ్య సంజీవని.. దాల్చిన చెక్క



**వింజమూరు. మేజర్‌న్యూస్ :** దాల్చిన చెక్క మనం నిత్యం తాగే టీ నుంచి మిఠాయిలు బిర్యానీ వరకు ఎక్కువగా వాడే ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఇచ్చే సుగంధ ద్రవ్యం రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రణలో ఉంచుతుంది. బరువు తగ్గడం సైన సమస్యలు నరాల బలహీనతను తగ్గిస్తుంది. వంటినొప్పి సమస్యలు కీళ్ల నొప్పులు వాపులను తగ్గిస్తుంది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. యాంటీ ఆక్సిడెంట్స్ యాంటీబయోటిక్ యాంటీ ఇన్ఫ్లమెటరీ లక్షణాలు అధికంగా ఉన్నందున వీటి వినియోగం క్రమంగా పెరుగుతూ వస్తుంది. ఇందులో విటమిన్ ఏకేఈ ఉంటాయి. రక్తనాళాల్లో రక్తం గడ్డ కట్టడాన్ని నిరోధిస్తుంది. శరీరంలో మెరుగైన రక్తప్రసరణకు దోహదపడుతుంది. మధుమేహాన్ని నియంత్రించడంలో దాల్చిన చెక్క బాగా తోడ్పడుతుంది. మెదడును చురుగ్గా ఉంచి హానికారక హార్మోన్లను పరిహరిస్తుంది. క్యాన్సర్ కణాలు పెరగనీయకుండా నిరోధిస్తుంది. చర్మ సౌందర్యానికి కేశ సంరక్షణకు బాగా తోడ్పడుతుంది.

**ఎక్కడెక్కడ సాగు :** దాల్చిన చెక్క శ్రీలంక వియత్నాం చైనా ఇండోనేషియా బెల్జియం మారిషషులలో ఎక్కువగా సాగుతుంది మనదేశంలో కేరళ కర్ణాటక రాష్ట్రంలో సాగులో ఉంది మన రాష్ట్రంలో గోదావరి జిల్లాలో ఆయిల్ ఫామ్ కొబ్బరి తోటల్లో దాల్చిన చెక్క పంటను రైతులు ప్రయోగాత్మకంగా సాగును ప్రారంభించారు అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో సహజ సిద్ధ అడవుల్లో ఈ పంటను విస్తరిస్తున్నారు గిరిజన రైతులు.

**దాల్చిన చెక్క ముఖ్య రకాలు :** భారతీయ సుగంధ ద్రవ్య పరిశోధన సంస్థ నవ్య శ్రీ నిత్యశ్రీ రకాలైన విడుదల చేసింది దాల్చిన చెక్కపొడి దాని నుంచి తీసిన నూనె రూపంలో విలువ ఆధారిత ఉత్పత్తులు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి అని ఉద్యాన పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు తెలియజేశారు.

# అలఘునాధుని మహాకుంభాభిషేకం నిర్వహించాలి

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలో ప్రాచీనచరిత్ర కలిగిన శ్రీశ్రీశ్రీ శ్రీదేవి భూదేవి అలఘునాధస్వామి ఆలయ మహాకుంభాభిషేకంను ఘనంగా నిర్వహించేలా నిర్ణయించారు. ఆగస్టు 5, 6, 7 తేదీల్లో మమాకుంభాభిషేకం నిర్వహించనుండగా ఆదివారం మహిళలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. అధికంగా పాల్గొన్న మహిళలనుద్దేశించి ఆలయకమిటీ ప్రతినిధులు ప్రసంగించారు. ఆలయాన్ని పునరుద్ధరించి 12 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మహాకుంభాభిషేకంను అత్యంత కోలాహలంగా ఘనంగా నిర్వహించతలపెట్టామని, మహిళలందరూ భాగస్వామ్యులై కుంభాభిషేకం కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు. మహిళలు మాట్లాడుతూ.. ఈకార్యక్రమంలో తమకు ఏ బాధ్యత అప్పగించినా చిత్తశుద్ధిగా నిర్వమిస్తామని, ఇది ఒక అదృష్టంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అందరి సమిష్టి సహకారంతోనే మమాకుంభాభిషేక మహెూత్సవాలను భక్తశ్రద్ధలతో అంగరంగవైభవంగా నిర్వహించతలపెట్టామని కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈసమావేశంలో నిత్యాన్నదాత, శ్రీసాంబశివ చారిటబుల్‌ట్రస్ట్ చైర్మెన్ కంచి పరమేశ్వరరెడ్డి, విహెచ్‌పి జిల్లా ఉపాధ్యక్షుడు సోమవరపు యానాదిరెడ్డి, ఆలయకమిటీ ప్రతినిధులు కె.వి.శేషారెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, ఆలయ అర్చకులు విశ్వనాధం శ్రీనివాసశర్మ, అధికసంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయరహదారిపై ఇసుకతొలగింపుకు ఎంవీఐ చర్యలు



ఇసుకతొలగింపుకు చర్యలు తీసుకుంటున్న ఎంవిఐ రాములు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** నెల్లూరు-ముంబాయి జాతీయరహదారిపై ఆత్మకూరు ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న ఇసుకను తొలగించేందుకు స్థానిక మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ ఎం.రాములు చర్యలు తీసుకున్నారు. ఇటీవల జాతీయరహదారిపై ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఏఎస్‌పేట క్రాస్‌రోడ్డు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండడంతోపాటు వారంవ్యవధిలోనే రెండు ప్రమాదాలు జరిగి ముగ్గురు మృతిచెందం, స్పందించిన రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హైవేఅథిరిటి, ఆర్‌అండ్‌బి, పోలీస్ తదితర అధికారులతో పరిశీలించి ప్రమాదనివారణా చర్యలు తీసుకోవాలని ఆదేశించడం తెల్సిందే. కాగా క్రాస్‌రోడ్డు వద్ద బ్యారికేట్లను, స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఆసమయంలో రోడ్డుపై ఇసుక అధికంగా పడి ప్రమాదకరంగా ఉంది. ద్విచక్రవాహనకారులకు మరింత ఆందోళనకరంగా మారింది. ఈపరిస్థితిని గమనించిన మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాములు ఆదివారం వెంటనే కొందరు కూలీలను ఏర్పాటుచేసి ఆ ఇసుకను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. దాంతో ప్రయాణీకులు, వాహనకారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎంవిఐకు కృతజ్ఞతలు తెలిపారు.

## బ్రహ్మారెడ్డి మృతి బాధాకరం : మాజీ ఎమ్మెల్యే



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం నాలుగో వార్డ్ వైసీపీ సీనియర్ నాయకులు పార్టీ కోసం నిరంతరం కష్టపడి పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీకి అండగా నిలబడి నాతో మొదటి నుంచి కలిసి నడిచిన యారం బ్రహ్మారెడ్డి మరణించడం నన్ను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని కావలి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వారి మరణం పార్టీకి తీరనిలోటని వారి కుటుంబానికి, సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని, ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ప్రమీల మరణం బాధించింది : తటవర్తి



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో నవోదయ క్లాత్ మార్కెట్ ప్రెసిడెంట్, ఆర్య వైశ్యులు వేమూరి పెద్దిశెట్టి సతీమణి వేమూరి ప్రమీల అకాల మరణించింది. విషయం తెలుసుకున్న కావలి ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు తటవర్తి రమేష్ ఆ మిమల్ని కారణాలు అడిగి తెలుసుకుని, ఆమె మరణాన్ని చింతిస్తూ వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని అలాగే వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అలాగే కావలి పట్టణ ఆర్యవైశ్యులు కూడా వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# ఆత్మకూరు ఆర్టీసీలో కొత్తబస్సులు రావు

- కొత్తసర్వీసులు లేవు
- పట్టణంలోకి రాని బస్సులు, ప్రయాణీకుల అవస్థలు
- నూతన డిఎం పరిశీలిస్తారా

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ఆర్టీసీ డిపో క్రమీణా తిరోగమనంవైపు సాగుతుందన్న అభిప్రాయం సర్వత్రా నెలకొంది. ఈ డిపోకు కొత్తగా బస్సులు రావడంలేదు. కొత్తసర్వీసులు కావాలన్న జనాల చిరకాల కోర్కెలు నెరవేరడం లేదు. వివిద డిపోలకు చెందిన బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రావడం లేదు. దాంతో ప్రయాణీకులు తీవ్రంగా ఇబ్బందిపడుతుండగా నెల్లూరు-ముంబాయి జాతీయ రహదారిపైన ఉన్న ఆత్మకూరు మండలం కరటంపాడుకుగానీ, మండలకేంద్రమైన మర్రిపాడుకుగానీ, ఆ మండంలోని డి.సి.పల్లికిగానీ, సమీప నియోజకవర్గమైన ఉదయగిరికి గానీ వెళ్ళాలంటే ఆత్మకూరు నుండి బస్సులు లేని పరిస్థితి కొనసాగుతుంది. కర్నూలుమీదుగా హైదరాబాదుకు బస్సు నడపాలని, చెన్నైకు హైటెక్ బస్సు నడపాలని, రాజధాని అమరావతికి బస్సునడపాలని పలువురు పదేపదే కోరినా ఆ కోర్కెలు నేటికీ నెరవేరలేదు. ఇటీవల ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.శివకేష్‌యాదవ్ ఈ డిపోలో సమస్యలను పరిష్కరిస్తారా, సమస్యలు పరిష్కరిస్తారా అని పలువురు ఆశిస్తున్నారు. ఈసమస్యలపై ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్మిక సంఘాలవారు ఆర్టీసీ అధికారుల దృష్టికి అనేకదపాలు తీసుకెళ్ళి సమస్యల పరిష్కారం కానందున వారు అలసిపోయి మౌనందాల్చారు. మార్చిలో ఆత్మకూరు డిపోకు విచ్చేసిన ఆర్టీసీ రీజనల్ చైర్మెన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డికి ఈ సమస్యలన్నింటిని కార్మికులు, పలువురు నాయకులు, ప్రయాణీకులు వివరించడంతోపాటు వినతిపత్రాలు కూడా సమర్పించారు. పరిశీలిస్తానని ఆయన హామీ ఇచ్చారు. బస్సులు అనేకం ఆత్మకూరు పట్టణానికి రానందున ప్రయాణీకులు 10రూపాయలు, 20రూపాయలు వెచ్చించి ఆటోల్లో నెల్లూరుపాళెంకు చేరుకొని అక్కడనుండి బస్సుల్లో ప్రయాణిస్తుండగా పలువురు ఆటోలనే ఆశ్రయిస్తున్నారు. ఆటోల ప్రయాణం ప్రమాదకరమని ఆర్టీసీవారు చెబుతుంటారు కానీ అందుకుతగిన బస్సులు నడపడంలేదని ప్రయాణీకులు అంటుంటే ఆటోలవలన జనాలు తమ బస్సుల్లో సక్రమంగా ఎక్కనందున నష్టం వస్తుందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. హైదరాబాదుకు గతంలో ఆరు బస్సులు ఆత్మకూరు డిపో నుండి నడుపుతుండేవారు. ప్రస్థుతం ఒక్క బస్సుమాత్రమే నడుపుతున్నారు. అదేమంటే రాబడి లేదని చెబుతున్నారు. ప్రవేటు బస్సులకు ధీటుగా నడపడం, కర్నూలుమీదుగా నడపడం జరిగితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తారు కదా అని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇతర జిల్లాలకు చెందిన కడప, అనంతపురం, జమ్మలమడుగు, బనగానపల్లి, తాడిపత్రి, పుట్టపర్తి, కళ్యాణదుర్గం, మన జిల్లాకు చెందిన నెల్లూరు, ఉదయగిరి, వాకాడు తదితర డిపోల బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి రాకుండా బైపాస్ అంటూ నెల్లూరుపాళెంమీదుగా నడుస్తున్నాయి. రాత్రివేళ ప్రయాణీకులు నెల్లూరుపాళెం వద్ద బస్సు దిగి అక్కడ ఆటోలు లేక, జనసంచారంలేక ఆందోళనకు గురికావడం, అవస్థలుపడడం, వారికోసం వారి బంధువులు నెల్లూరుపాళెంకు వెళ్ళి అక్కడనుండి తమవారిని తీసుకురావాల్సిన పరిస్థితి కొనసాగుతుంది. మన జిల్లా బస్సులు కూడా పట్టణంలోకి రానందున ఉదయగిరి, మర్రిపాడు, కరటంపాడు, డి.సి.పల్లి తదితర ప్రాంతాలకు వెళ్ళాలంటే ఆటోల్లో నెల్లూరుపాళెంకు వెళ్ళి అక్కడ బస్సులెక్కడం వలన సమయం వృధా, అదనపు వ్యయం అవుతుంది. నెల్లూరుపాళెం నుండి 3కిలో మీటర్లలోని ఆత్మకూరు పట్టణానికి బస్సులు రావాలంటూ అంతగా వారు ఇబ్బందిపడుతుంటే ప్రయాణీకులు ఎన్ని ఇబ్బందులు పడినా పరావలేదని ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారా అని సర్వత్రా ప్రశ్నిస్తున్నారు. ఈ సమస్యలపై గతంలో మంత్రి హెూదాలో నేటి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని కోరినా ఫలితం లేకపోయింది. ఆత్మకూరు పట్టణం జాతీయరహదారికి 3 కిలోమీటర్లలో ఉండడమే శాపమా, తాము చేసుకున్న పాపమా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పట్టణంలోకి వచ్చేందుకు 10నిముషాలు సమయం పడుతుందని ఆర్టీసీవారు భావిస్తే ప్రయాణీకులు ఎంతసమయం వృధా చేసుకున్నా, అదనపు భారం మోస్తున్నా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. అమరావతి రాజధాని కేంద్రంగా ఉండగా అక్కడకు ఒక్క బస్సునడేపే అవసరం లేదా అని కూడా ప్రశ్నిస్తున్నారు. ఇందనపొదుపు అంటూ ఆత్మకూరు డిపోబస్సుల వేగం పరిమితం చేశారని, అందుకే ఆత్మకూరునుండి నెల్లూరుకు పలు ఆర్టీసీ బస్సులున్నా అనేకమంది నెల్లూరుపాళెంకు వెళ్ళి ఉదయగిరి, ఇతర జిల్లాల బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఈ సమస్యలను గురించి రెండేళ్ళ క్రితం ఆత్మకూరుకు విచ్చేసిన రవాణాశాఖామంత్రి పినిపేవిశ్వరూప్‌కు అప్పటి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ద్వారా ప్రజలు వినతిపత్రాలు అందజేయగా అతిత్వరలో సమస్యలు పరిష్కరిస్తామని హామీలిచ్చి వెళ్ళారు. ఇక అంతేసంగతులు ఆ హామీల మాటే మరిచిపోయారు. ఇక్కడి సమస్యలు అలాగే నిలిచిపోయాయి. ప్రభుత్వరంగ సంస్థ, ప్రభుత్వంలో విలీనమైన సంస్థ కేవలం రాబడిలేదని బస్సులు హైదారాబాదులాంటి నగరాలకు కూడా తగ్గించడం, కొత్త సర్వీసులు ప్రారంభించకపోవడం, పలుమార్గాల్లో సక్రమంగా బస్సులు నడపకపోవడం సబబేనా అని పలువురు ప్రవ్నిస్తున్నారు. పరోక్షంగా ప్రవేటు బస్సులకు, ఆటోలకు ప్రభుత్వం ఊతమిస్తుందా అనే సందేహాలు కూడా వ్యవక్తమవుతున్నాయి. మరి ఆర్టీసీ ఉన్నతాధికారులు, ప్రభుత్వ పాలకులు ఆత్మకూరులోని ఆర్టీసీ సమస్యలను పరిశీలించి తగిన చర్యలద్వారా సమస్యలు పరిష్కరిపస్తారా, కనీసం అన్ని బస్సులు ఆత్మకూరు పట్టణంలోకి వచ్చేలా చేస్తారా, లేక ఆత్మకూరు పట్టణాన్ని జాతీయరహదారిపైకే తరలించమంటారా వేచి చూడాల్సి ఉంది.



## పొగాకు పంటకు గిట్టుబాటుధరలు లేక..

# లబోదిబోమంటున్న రైతులు

- పట్టించుకోని ప్రభుత్వాలు
- పెరిగిన ధరలు, ప్రకృతివైపరీత్యాలు
- తీవ్రనష్టాలు చవిచూసే పరిస్థితులు


బ్యారన్లలో పొగాకుక్యూరింగ్

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మెట్టప్రాంతంలో వాణిజ్య పంటగా వర్జీనియాపొగాకును సాగుచేస్తున్న రైతులు తమకు ఈదపా గిట్టుబాటు ధర లభించడం లేదని అరిచి గీపెడుతున్నా, ఆందోళనలు చేస్తున్నా, పాలకులెవ్వరూ స్పందించడంలేదని, వ్యాపారుల ఇష్టారాజ్యంగా ఉందని, వేలం నిర్వాహణాధికారులు నిస్సహాయులుగా ఉన్నారని, వెరసి తాము తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆత్మకూరు పరిధిలోని మర్రిపాడు మండలం డి.సి.పల్లి పొగాకు వేలం కేంద్ర పరిధిలోని రైతులు ఆవేదన, ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈదపా పెరిగిన సేద్యంవ్యయం, ఎరువులు, పురుగుల మందుల ధరలు, తుఫాన్, వరదలతో వేసిన పంట దెబ్బతినగా మళ్ళీమళ్ళీ నాటాల్సి రావడం జరగ్గా అందుకుతగ్గట్లుగా గిట్టుబాటు ధరలు లభించనందున వారంతా వాపోతున్నారు. రాష్ట్రంలో పలుప్రాంతాల్లో రైతులు పొగాకుపంటను రోడ్లపై వేసి తగులబెడుతూ నిరసనలు వ్యక్తం చేస్తుండగా డి.సి.పల్లి పరిధిలో రైతులు ధర్నాలు, రాస్తారోకోలు, వేలాన్ని బహిష్కరించడం తదితర నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నా ఏమాత్రం ఫలితంకానరావడం లేదు. గత ఏడాది పొగాకుకు కాస్తంతగా గిట్టుబాటుధరలు లభించి కొంతమేరకు రైతులకు లాభాలు రాగా ఈదపా రైతులు ఉత్సాహంగా కొంతమేరకు అధికంగా కూడా పొగాకు సాగుచేశారు. అయితే ఈదపా ధరలు తక్కువగా ఉండడం, లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయకపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అనివార్యమై పొగాకును తక్కువధరలకు అమ్ముకుంటూ నష్టాలను అంచనాలు వేసుకుంటూ కాలం గడుపుతున్నారు. ఇటీవల డి.సి.పల్లి పొగాకు కేంద్రంలో ధరలు చూస్తే ఒక్క కెజిపొగాకు గరిష్ట ధర 280 రూపాయలు, కనిష్టధర 160 రూపాయలు, సగటుధర 224 రూపాయలుగా ఉంది. పెరిగిన వ్యవసాయ, పంటసాగు ధరలు ప్రకారం ఒక కెజి పొగాకు పండించేందుకు సుమారు 300రూపాయలు అవుతుందని, 350రూపాయలు లభిస్తేనే తమకు గిట్టుబాటు అవుతుందని రైతులు చెబుతున్నారు. పొగాకు కొనుగోళ్ళకు భారత పొగాకు బోర్డులో వ్యాపారులు అధికంగా నమోదు చేసుకుంటున్నా తక్కువమంది మాత్రమే వేలంలో పాల్గొంటున్నారు. ఆవ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల శ్రమను దోచుకుంటున్నారని వారంతా వాపోతున్నారు. పాలకులు పొగాకు రైతులను ఆదుకుంటున్నామని ప్రకటనలు చేస్తుంటారే తప్ప వారు తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యంగా ఉంది. నాయకులు తరచూ వచ్చి వేలంకేంద్రంలో రైతులను ఊరడించడం, తమవంతుగా గిట్టుబాటుధర లబించేందుకు కృషిచేస్తామని వెళుతుండడం తప్ప వారికి ఒరిగిందేమీ కానరావడం లేదు. ప్రభుత్వాలపరంగా వ్యాపారులు అధికంగా పాల్గొనేలా, వారిలో పోటీతత్వం పెంచేలా కృషిచేయడం కానీ, ప్రభుత్వమే రైతుసంక్షేమనిధి ఏర్పాటు చేసి నేరుగా ఐటిసిద్వారా కొనుగోలు చేయడం కానీ తదితర చర్యలు లేనేలేవు. అసలే మెట్టప్రాంతం, అదునులో వర్షాలు కురిసే పరిస్థితి లేనందున దూరంనుండి నీటిని పారుదలచేస్తూ అధికవ్యయం భరిస్తుంటారు. వరదలు, తుఫాన్లవలన పంటనష్టపోతుంటారు. సేద్యం వ్యయం, రసాయనిక ఎరువులు, పురుగుమందులు పెరిగిపోతూనే ఉన్నాయి. కూలీల వేతనాలు కూడా గణనీయంగా పెరిగాయి. దాంతో పంటసాగువ్యయం తడిసిమోపెడవుతుంది. తీరా అమ్మకాలవద్ద చూస్తే కంటతడిపెట్టుకోవాల్సి వస్తోంది. గతంలో తూర్పు,పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకే పరిమితమైన వర్జీనియా పొగాకు నెల్లూరు జిల్లాకు ప్రాకింది. మెట్టపొలాల్లో జొన్న తదిరపంటలు పండించుకుంటూ వాటికి ధరలు, ఆదరణ లేక ఎదురుచూస్తున్న నెల్లూరు జిల్లా మెట్టరైతులు పొగాకు సాగును ఆరంభించారు. బ్యారన్లు నిర్మించుకొని లైసెన్సులు పొందారు. అప్పట్లో ప్రవేటు వ్యాపారసంస్థలు పొగాకు కొనుగోళ్ళు చేస్తుండగా వారిఇష్టారాజ్యంగా ఉందంటూ రైతులు గగ్గోలు పెడుతుండగా కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో భారపొగాకుబోర్డును గుంటూరును కేంద్రంగా చేసి ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో బోరు ఆధ్వర్యంలో 21పొగాకు వేలంకేంద్రాలను ఏర్పాటుచేయగా నెల్లూరు జిల్లాలో కలిగిరి, డి.సి.పల్లిల్లో ఏర్పాటు చేశారు. ఉదయగిరి, ఆత్మకూరు, మర్రిపాడు, వింజమూరు, కలిగిరి, వరికుంటపాడు, కొండాపురం, దుత్తలూరు, జలదంకి, చేజర్ల, కలువాయి, పొదలకూరు, ఏఎస్‌పేట, సంగం తదితర మండలాల్లో పొగాకు సాగుచేస్తున్నారు. డి.సి.పల్లి వేలంకేంద్రపరిధిలో 17971పొగాకు బ్యారన్లు ఉన్నాయి. ఒక్కో బ్యారన్‌కు 8ఎకరాలవంతున పంటసాగుకు అనుమతిస్తుండగా అది సక్రమంగా వస్తుందోలేదో అన్న సందేహంతో బ్యారన్‌కు సగటున 10ఎకరాలు సాగుచేస్తుంటారు. అత్యంత వ్యయప్రయాసతో పొగాకు నారుమళ్ళు సాగించి పొలాల్లో నాట్లువేసి కలుపులుతీసి, ఎరువులు వేసి పురుగులమందులు వినియోగించి, ఆకును రెల్చి బ్యారన్లలో క్యూరింగ్‌చేసిన అనంతరం గ్రేడింగ్ చేసి బేళ్ళుగా తయారుచేసి వాటిని వేలంకేంద్రానికి తీసుకెళ్ళి అమ్మకాలు సాగించాల్సి ఉంది. ఇందుకు అధికంగా వ్యయమవుతుంది. కాగా అమ్మబోతే అడివి చందంగా వేలంకేంద్రాల్లో తగిన ధర లభించనందున లబోదిబోమంటూ నష్టాలబారినపడే పరిస్థితి ఏర్పడింది. పెరిగిన వ్యయం దృష్ట్యా ఒకకెజి పొగాకుకు కనీసం 350రూపాయలు లభిస్తేనే గిట్టుబాటు అదుతుందని, లోగ్రేడ్ పొగాకును కూడా గతంలోలాగా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. విదేశీఆర్డర్లు లేవన్న సాగుకుచూపుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న వ్యాపారులను సరైన కొనుగోలు మార్గంలో నిలిపేలా ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే దాదాపు 50శాతం పొగాకు అమ్మకాలు జరిగాయని, ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించాలని రైతులు కోరుతున్నారు.


పొగాకు గ్రేడింగ్


అమ్మకానికిపెట్టిన పొగాకుబేళ్ళు


పొగాకు నారుమళ్ళు


పొగాకుబ్యారన్లు

# 37వ డివిజన్ వైసీపీ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం





**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ నియోజకవర్గం చింతారెడ్డి పాళెం లోని వైసీపీ కార్యాలయం నందు ఆనం విజయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 37వ డివిజన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనం విజయకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మన నెల్లూరు రూరల్‌లో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త, రూరల్ అధికార పార్టీ నాయకుల ఆగడాలకు బయపడి బయటికి రాలేని పరిస్థితుల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డి నన్ను నెల్లూరు రూరల్ అధ్యక్షులుగా నియమించిన తరువాత రూరల్ నియోజకవర్గ నా మొదటి పార్టీ సమావేశంకి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మీద అభిమానంతో నిజమైన నాయకులు, కార్యకర్తలు నేను కూడా ఊహించనంతగా వేలాదిగా కదిలి వచ్చి మొదటి సమావేశాన్ని విజయవంతం చేసి నాలో ఎంతో గుండె నిబ్బరాన్ని నింపి నాకు ఎంతో మనోబలాన్ని ఇచ్చారు అని అన్నారు. ప్రతి డివిజన్ నుండి నాయకులు, కార్యకర్తలు, ప్రతి డివిజన్‌లో స్ట్రాంగ్ కమిటీ ఏర్పాటు చేసుకుని నిజమైన పార్టీ అభిమానులు స్వచ్ఛందంగా తరలి వచ్చి ఈ ఆత్మీయ సమావేశాలను విజయవంతం చేస్తున్నారని అందరికి హృదయపూర్వక ధన్యవాదాలు అని తెలియజేస్తూ, మీ అందరి సహకారంతో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైసీపీ పార్టీకి పూర్వవైభవం, తీసుకునివచ్చి గ్రౌండ్ లెవల్లో కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తని నూతన నాయకులుగా తయారు చేసుకుని కమిటీల్లో నియమించికుని పార్టీ కోసం ఎవరైతే నిజంగా కష్టపడి పనిచేస్తారో వారికే ప్రాధాన్యత ఇస్తామని అలంకారప్రాయంగా పదవులు పొంది షో చేసే వాళ్ళు పార్టీకి అవసరం లేదని,ఇప్పటికే చాలామంది నెల్లూరు రూరల్లో వైసీపీ నాయకులు కార్యకర్తలు పార్టీ బలోపేతం చేసే దిశగా బాగా కష్టపడుతున్నారు అని ఇప్పటికే పార్టీ నెల్లూరు రూరల్లో చాలా జోరుగా బలోపేతం అయ్యిందని, వైఎస్ జగన్మోహన్ రెడ్డి అంటే అభిమానం ఉండే వాళ్ళు, నియోజకవర్గ పార్టీ నాయకత్వం మీద నమ్మకం ఉండే వాళ్ళు ప్రతి నాయకుడు, కార్యకర్త, అందరం కలిసి ఒక కుటుంబంగా కలిసికట్టుగా పనిచేసి ఇంకా పార్టీని బలోపేతం చేద్దాం అని తెలియజేశారు. నెల్లూరు రూరల్ వైసీపీ పార్టీలో ప్రతి ఒక్కరికి నేను 24గం అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్కరితో నేను ఆత్మీయంగా స్నేహంగా మీ అందరితో కలిసి ఉంటాను అని పార్టీ పరంగా మీ ప్రతి సమస్యని నా సమస్యగా భావించి మీకు అండ దండుగా ఉంటానని తెలియజేశారు. అలాగే 37వ డివిజన్ నుండి భారీగా తరలి వచ్చిన డివిజన్ కమిటీ సభ్యుల అభీష్టం మేరకు నాయకులు,కార్యకర్తల సమక్షంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 37వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా అనిల్‌ని నియమించడం జరిగింది. అదేవిధంగా ప్రతి ఒక్క నాయకుడు, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర అధ్యక్షుడు, 37వ డివిజన్ కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్, 28వ డివిజన్ ఇన్‌చార్జ్ నెల్లూరు మదన్ మోహన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాస్ రావు, రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రెటరీ శ్యామ్ సింగ్, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగ అధ్యక్షుడు కనకట్ల మోహన్ రావు ముదిరాజ్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు నవీన్ కుమార్ రెడ్డి, ఆర్టీఐ అధ్యక్షుడు సుకుమార్ రెడ్డి, నాయకులు బాబు పాల్గొన్నారు.

# వైసీపి ఐదేళ్ల పాలనలో ప్రజలకు ప్రత్యక్ష నరకం



## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెంచలబాబుయాదవ్

**నెల్లూరు/వేదాయపాళెం, మేజర్‌న్యూస్ :** వైసీపి ఐదేళ్ల పాలనలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్మోహన్రెడ్డి తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపించారని మాజీ జడ్పీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలోని వివరాలిలా ఉన్నాయి. జగన్రెడ్డి ఐదేళ్ల పాలనలో అరాచకమంటే ఎలా ఉంటుందో రాష్ట్ర ప్రజలు ప్రత్యక్షంగా చూశారన్నారు. ప్రజాస్వామ్య విలువలను తుంగలోతొక్కి అడ్డగోలు పాలనతో రాష్ట్రాభివృద్ధిని అదోగతిపాలు చేసిన జగన్కు కూటమి ప్రభుత్వం గురించిగానీ, ప్రజాస్వామ్య పరిరక్షణ గురించిగానీ మాట్లాడే అర్హతలేదన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలంటూ వైసీపీ నేతలు స్వయంగా గవర్నర్కు ఇచ్చిన ఫిర్యాదు పత్రం విడ్డూరంగా ఉందన్నారు. పాఠశాలలు పునః ప్రారంభమైన రోజునుంచే కుటుంబంలో ఎంత మంది ఉంటే.. అంతమందికి తల్లికి వందనం పథకం కింద నగదు అందజేసిన ఘనత విజనరీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద త్వరలోనే రైతుల ఖాతాల్లో రూ.20వేలు జమ చేయనున్నట్లు తెలిపారు.

# వికలాంగులకు ఇంటి వద్ద రేషన్‌ను అందజేయాలి : దివ్యాంగుడు వెంకట్రావు




**కావలి, మేజర్‌న్యూస్ :** గత వైసీపీ ప్రభుత్వం పాలనలో ఇంటింటికి రేషన్ను అందించేందుకు రేషన్ వెహికల్‌ను ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం సాధారణ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ వాహనాలను నిలిపివేయడం జరిగింది. అయితే వృద్ధులకు రేషన్ డీలర్స్ ఇంటివద్దకే వచ్చి రేషన్ అందించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. అయితే వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ డీలర్స్ అందజేయాలని దివ్యాంగుల రాష్ట్ర నాయకుడు మండవ వెంకట్రావు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వ పరిపాలన బాగున్నప్పటికీ క్రింద స్థాయి అధికారులు ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తుందని ఆయా నియోజక వర్గాల్లో ఉండే ఎమ్మెల్యేలు ఇటువంటి పరిస్థితులు కలకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులు అనేక రకాలుగా దివ్యాంగులను ఇబ్బంది పెడుతున్నారని దివ్యాంగులకు వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ అందడం లేదని తెలిపారు. ఇంటి వద్దకే రేషన్డీలర్లు తెచ్చి ఇచ్చేందుకు ప్రభుత్వం అన్ని విధాల చర్యలు తీసుకోవాలని తెలిపారు.ప్రభుత్వ అధికారులు ఎమ్మెల్యేలు తమ యొక్క స్థాయిలో ఎప్పటికప్పుడు సమీక్ష సమావేశం నిర్వహించుకొని మాంటింగ్ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కావలి నియోజక వర్గంలో కావలి పట్టణము చుట్టుపక్క గ్రామాల్లో కూడా వికలాంగులకు సరిగా రేషన్ అందించడం లేదని ఈ విషయాన్ని ప్రజల్లో కొంత అసమ్మతి ఉందని తెలిపారు. ఈ విషయంపై ఉన్నత అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని మండవ వెంకటరావు తెలిపారు.

సూర్య

విలేకర్లు కావలెను

తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.

కావలసిన సెంటర్లు

నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, అనంతసాగరం, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను

మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు

9000118811, 9000483583

## చికెన్ వ్యర్థాల అక్రమ డంపింగ్‌పై..

# ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఉక్కుపాదం



**బుచ్చిరెడ్డిపాలెం, మేజర్‌న్యూస్ :** కోవూరు నియోజకవర్గంలో చికెన్ వ్యర్థాల మాఫియాను నియంత్రించేందుకు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు అన్ని ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయబడింది. ఈ చర్యల ఫలితంగా పెనుబల్లి గ్రామంలో, స్థానిక యువత, నాయకుల చొరవతో వేకువజామున 2 లారీలు, 3 బైకుల ద్వారా తరలిస్తున్న చికెన్ వ్యర్థాలను పట్టుకుని, వాటిని పోలీసుల ఆధీనానికి అప్పగించారు. సమాజ హితానికి ఈ చర్యలో భాగస్వామ్యం అయిన ప్రతి యువకునికి, నాయకుడికి హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# వెంగమాంబ ఆషాడ మాస సారె ఆహ్వానం



**దుత్తలూరు/వింజమూరు, మేజర్‌న్యూస్ :** దుత్తలూరు మండలం నరవాడ గ్రామంలో వెలసియున్న శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారి ఆషాడ మాస సారే కార్యక్రమానికి రావలసిందిగా కడప జిల్లా అచల ఆశ్రమం తోటపల్లి స్వామీజీ గిరజానంద స్వామిని ఘనంగా ఆహ్వానించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేకపాటి మాల్యాద్రి సహచర బృందం ఆధ్వర్యంలో కలిసి ఆహ్వానం అందజేశారు. శ్రీ వెంగమాంబ పేరంటాల అమ్మవారి 40 రోజుల కార్యక్రమం సందర్భంగా ఆషాడం మాస్టర్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆ కార్యక్రమానికి తప్పక హాజరై విజయవంతం చేయవలసిందిగా ఆయనకు విజ్ఞప్తి చేశారు నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల మహిళలు గాజులు, పసుపు కుంకుమ మొదలైన సారె సామాగ్రిని తీసుకొని అమ్మవారికి సమర్పించాల్సిందిగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో శాంతి సౌభాగ్యాలతో వర్ధిల్లాలని అమ్మవారి కరుణ కటాక్షములు ఎల్లవేళలా ఉండాలని ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా మహిళా విభాగం సహకన్వీనర్ ఎస్ స్రవంతి కే.భాస్కర్ తదితరులున్నారు.